www.akshratimes.com
తెలుగు దినపత్రిక
అక్షర టైమ్స్
మా అక్షరం ప్రజల పక్షం
ఆనంతపురము జిల్లా / శ్రీ సత్యసాయి జిల్లా

# 'అనంత'కు కృతజ్ఞతలు తెలిపిన ఎస్. సత్యనారాయణ



**అనంతపురం,జూన్04 .అక్షర టైమ్స్:** వైయస్సార్సీపి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శిగా నూతనంగా నియమితులైన నారాయణపురం కు చెందిన సత్యనారాయణ పలువురు నాయకులతో కలిసి వైయస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేసారు. సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ.. పార్టీ పటిష్ఠతకు కృషి చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను గురించి ప్రజలకు వివరించాలన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి జగన్మోహన్ రెడ్డి, నాగిరెడ్డిపల్లి రామసుబ్బారెడ్డి, ఉమ్మడి మదన్ మోహన్ రెడ్డి, ఆలుమూరు శ్రీనివాస్ రెడ్డి, మల్లెల వేణుగోపాల్, బళ్లారి లక్ష్మీనారాయణ, జాఫర్, పసుపులేటి రవి, సుబ్బారెడ్డి, లింగారెడ్డి, గుజ్జల సురేష్, అమర్నాథ్ రెడ్డి, సుధాకర్, మహమ్మద్, చిన్న బాబయ్య, సూర్యనారాయణ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, నాగార్జున, సాకే అశోక్ కుమార్, నరేష్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మవరం, లేపాక్షిలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పర్యటన

- పర్యావరణం నుంచి అభివృద్ధి వరకు.. వరుస కార్యక్రమాల్లో మంత్రి సత్యకుమార్ యాదవ్
- సత్యసాయి నగర్‌లో నూతన డ్రైనేజ్ కాలువల శంకుస్థాపన చేయనున్న మంత్రి సత్యకుమార్ యాదవ్
- పినదరి, సుబ్బారావుపేటలో పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొననున్న మంత్రి సత్య కుమార్ యాదవ్



**ధర్మవరం,జూన్04.అక్షర టైమ్స్:** రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య విద్య శాఖామాత్యులు, ధర్మవరం శాసనసభ్యులు సత్యకుమార్ యాదవ్ గారు జూన్ 05, 07, 08 మరియు 09 తేదీల్లో ధర్మవరం నియోజకవర్గం మరియు లేపాక్షి ప్రాంతాల్లో పర్యటించనున్నట్లు మంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ పర్యటనలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు, భూ సంబంధిత సేవా కార్యక్రమాలు మరియు మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన పలు కార్యక్రమాల్లో మంత్రి పాల్గొననున్నట్లు వివరించింది. శు క్రవారం ఉదయం 09:00 గంటలకు ధర్మవరం ఆర్టీసీ బస్టాండు వద్ద ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొని మొక్కలు నాటనున్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు పరిశుభ్రమైన వాతావరణాన్ని అందించాలంటే విస్తృత స్థాయిలో మొక్కల పెంపకం అవసరమని మంత్రి కార్యాలయం తెలిపింది. అనంతరం మధ్యాహ్నం 12:00 గంటలకు ధర్మవరం పట్టణంలోని సత్యసాయి నగర్ ప్రాంతంలో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజ్ కాలువల శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఈ పనుల ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన పారిశు ధ్య సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 1:00 గంటల నుండి ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ప్రజలు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలకు మంత్రి అందుబాటులో ఉండి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నారు. ఆదివారం ఉదయం 06:00 గంటలకు లేపాక్షి ఆలయం వద్ద నిర్వహించే యోగా కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఆరోగ్య పరిరక్షణలో యోగా పాత్ర ఎంతో కీలకమని, ఆరోగ్యకర జీవన విధానానికి యోగా దోహదపడుతుందని ఈ సందర్భంగా మంత్రి కార్యాలయం వెల్లడించింది. అనంతరం మధ్యాహ్నం 3:30 గంటలకు తాడిమర్రి మండలం పినదరి గ్రామంలో నిర్వహించే పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని లబ్ధిదారులకు పాస్ పుస్తకాలు అందజేస్తారు. సోమవారం ఉదయం 10:00 గంటలకు ధర్మవరం మండలం సుబ్బారావుపేట గ్రామంలో నిర్వహించే పట్టాదార్ పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. భూ యాజమాన్యానికి సంబంధించిన సేవలను మరింత పారదర్శకంగా ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. అనంతరం మధ్యాహ్నం 3:00 గంటల నుండి ధర్మవరం ఎన్డీఏ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలపై వినతులు స్వీకరించనున్నారు. మంగళవారం ఉదయం 10:00 గంటలకు ధర్మవరం, టియోడ్కో కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కెవి సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలు అందనున్నట్లు మంత్రి కార్యాలయం పేర్కొంది. ఈ పర్యటనలో ప్రజల సమస్యల పరిష్కారం, మౌలిక వసతుల అభివృద్ధి, ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడం మరియు సంక్షేమ కార్యక్రమాల అమలుపై మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు మంత్రి కార్యాలయం వెల్లడించింది.

# జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య అందించండి

- జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ కు ఏపీడబ్ల్యూజేఎఫ్ విజ్ఞప్తి
- జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపు పై కూడా విజ్ఞప్తి
- జర్నలిస్టుల సమస్యలను కలెక్టర్ కు వివరించిన ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు
- విద్య, వైద్యం విషయంలో స్పష్టమైన హామీ ఇచ్చిన జిల్లా కలెక్టర్



**అనంతపురం,జూన్04.అక్షర టైమ్స్:** జిల్లాలో అక్రిడిటేషన్ జర్నలిస్టుల పిల్లలందరికీ కార్పొరేట్, ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచితంగా విద్య అందించేలా చూడాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ కు విజ్ఞప్తి చేశారు. గురువారం ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు, ఇతర నాయకులు కలెక్టరేట్ లో కలెక్టర్ ఓ. ఆనంద్ ను కలిశారు. ప్రస్తుతం విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న నేపథ్యంలో జర్నలిస్టులకు సంబంధించిన కొన్ని అంశాలను కలెక్టర్ కు వివరించారు. అనంతపురం జిల్లాలో 700 మంది అక్రిడేటెడ్ జర్నలిస్టులున్నారని.. వీరిలో అత్యధిక మందికి వేతనాలు కూడా సరిగా అందని పరిస్థితులున్నాయన్నారు. వారికి సాధారణ జీవనం గడవటమే కష్టతరంగా ఉంటోందని.. కుటుంబపరమైన ఖర్చుల్లో ప్రధానమైనవి పిల్లలకు విద్యా, కుటుంబ ఆరోగ్యం కోసం అయ్యే వైద్యం ఖర్చులు అధికంగా ఉంటున్నాయన్నారు. ఈ రెండింటికి మీ సహకారం తోడ్పాటు కావాలని జిల్లా జర్నలిస్టుల తరుపున ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు కోరారు. విద్యకు సంబంధించి గత కొన్ని సంవత్సరాలుగా జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్యను జిల్లా కలెక్టర్ ప్రత్యేక ఆదేశాల ప్రకారం అమలు చేస్తూ వస్తున్నారని వివరించారు. ఈ ఏడాది అనంతపురం జిల్లాలోని జర్నలిస్టు పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా తగిన ఆదేశాలను విద్యాశాఖకి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. వైద్యానికి సంబంధించి ప్రభుత్వం బీమా సౌకర్యాన్ని కల్పించిందని.. అయితే ప్రీమియం చెల్లించిన వారికే ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ ప్రీమియంకు చెల్లింపునకు సహకరించాలని కోరారు. ఏపీడబ్ల్యుజేఎఫ్ నాయకుల విజ్ఞప్తిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. జర్నలిస్టుల పిల్లల ఉచిత విద్యకు సంబంధించి జిల్లా విద్యాశాఖ అధికారి, యూనియన్ నాయకులతో త్వరలోనే సమావేశం నిర్వహించి తగిన నిర్ణయం తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జర్నలిస్టుల హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియం కు సంబంధించి సిఎస్ఆర్ ద్వారా అందించే ప్రయత్నం చేస్తామన్నారు. ఈ సందర్భంగా ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ ప్రస్తుతం జర్నలిస్టుల్లో 90 శాతం మంది ఆర్థికంగా జీవ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సమాజంపై బాధ్యతతో.. ప్రజల కోసం పనిచేసే జర్నలిస్టులకు వచ్చే వేతనాలు ఏమాత్రం సరిపోక పిల్లలకు మంచి చదువులు అందించలేకపోతున్నారన్నారు. అందుకే కార్పొరేట్ ప్రైవేట్ విద్యాసంస్థల్లో వారి పిల్లలకు ఉచిత విద్య అందించే విధంగా చొరవ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. అలాగే హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంకు సంబంధించి కూడా ఉచితంగా అందించే ప్రయత్నం జరుగుతుందన్నారు. ఈ రెండు అంశాలపై జిల్లా కలెక్టర్ సానుకూలంగా స్పందించారని మరోసారి వీటి పై సమావేశమై జర్నలిస్టు కుటుంబ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్, వారి పిల్లలకు ఉచిత విద్య అమలైన ఏపీడబ్ల్యూజేఎఫ్ చొరవ తీసుకుంటుందని రామాంజనేయులు తెలిపారు.

# హామీల అమలులో విఫలమైన కూటమి ప్రభుత్వం

- ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి: నైరుతి రెడ్డి





**గుత్తి,జూన్04.అక్షర టైమ్స్:** అనంతపురం జిల్లా గుత్తి పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం "వెన్నుపోటు పాలనకు రెండేళ్లు" పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి నాయకత్వం వహించారు.ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం గాంధీ సర్కిల్ వద్ద తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రణాళికతో పాటు చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ పేర్లతో ప్రజలకు ఇచ్చిన హామీల బాండ్లను వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా నైరుతి రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రచార ఆర్భాటాలకు మాత్రమే పరిమితమవుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో గత రెండేళ్లుగా వెన్నుపోటు పాలన కొనసాగుతోందని, ప్రజలను మోసం చేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు సమీపిస్తున్నాయని అన్నారు.వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అమలైన సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చంద్రగ్రహణం పట్టిందని ఆమె విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు రెండేళ్లు గడిచినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదని, సంక్షేమ పథకాలకు కోతలు విధిస్తూ ప్రజలపై అప్పుల భారం మోపుతున్నారని పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ, భారతీయ జనతా పార్టీ, జనసేన పార్టీలు కలిసి ప్రజలను మోసం చేశాయని ఆరోపించారు. ప్రజల తరఫున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటాలు నిరంతరం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ మండల పరిషత్ అధ్యక్షుడు కోన మురళీధర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు విశాలాక్షి, జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు చంద్రగిరి రాధా యాదవ్, జిల్లా కార్యదర్శి గురు ప్రసాద్ యాదవ్, క్రిస్టియన్ మైనార్టీ జిల్లా అధ్యక్షుడు వైపి బాబు, మహిళా నాయకురాలు డాక్టర్ శాంతి ప్రియ, హేమలత రెడ్డి, సీనియర్ నాయకులు రామ సుబ్బారెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, రంగస్వామి, గుత్తి మున్సిపల్ విభాగం అధ్యక్షుడు షఫీ, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జూన్ 7న శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం

- ముదిగుబ్బలో ఆధ్యాత్మిక వేడుకలకు సర్వం సిద్ధం
- నైమిశారణ్యం ఉత్సవ విగ్రహాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు
- అధిక మాస పుణ్యఫలాల కోసం భక్తులను ఆహ్వానిస్తున్న నిర్వాహకులు







**ముదిగుబ్బ,జూన్04.అక్షర టైమ్స్:** అధిక మాసం సందర్భంగా ముదిగుబ్బలోని శ్రీ వాసవీ కళ్యాణ మండపంలో ఈ నెల 7వ తేదీ ఆదివారం ఉదయం శ్రీ సత్యనారాయణ స్వామి అభిషేకం, వ్రత కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నట్లు ఆర్య వైశ్య సంఘం, శ్రీ వాసవీ మహిళా మండలి, యువజన సంఘం సంయుక్తంగా వెల్లడించాయి. ఉదయం 5 గంటలకు గణపతి పూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని, అనంతరం నవగ్రహ పూజ, పాలాభిషేకం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, మహా మంగళహారతి నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, అల్పాహారం అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిష్ఠించనున్న ఉత్సవ విగ్రహాలు పవిత్ర పుణ్యక్షేత్రమైన నైమిశారణ్యం నుంచి తీసుకువచ్చినవని నిర్వాహకులు తెలిపారు. నారద మహాముని సూత మహామునికి శ్రీ సత్యనారాయణ స్వామి వ్రత మహిమను వివరించిన క్షేత్రంగా నైమిశారణ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉందన్నారు. అలాగే దత్త పీఠం ఆధ్వర్యంలో నైమిశారణ్యంలో నిర్మాణంలో ఉన్న ఆలయానికి ఈ ఉత్సవ విగ్రహాలు చేరనున్నట్లు తెలిపారు. ఆలయ నిర్మాణానికి భక్తులు తమ వంతు సహకారం అందించాలని, ఒక్క ఇటుక విరాళం రూ. 1,116గా నిర్ణయించినట్లు పేర్కొన్నారు. భక్తులు తమకు తోచినంత విరాళాన్ని అందించి ధార్మిక కార్యక్రమాల విజయవంతానికి సహకరించాలని కోరారు. అధిక మాసంలో నిర్వహించే ఈ పుణ్య కార్యక్రమంలో మండలంలోని భక్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీ సత్యనారాయణ స్వామి అనుగ్రహం పొందాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు.

# చెట్లు నాటండి - పర్యావరణాన్ని పరీక్షించండి

- ఎన్జివో ఆధ్వర్యంలో ర్యాలీ




**పెద్దవడుగూరు,జూన్04.అక్షర టైమ్స్:** చెట్లు విరివిగా నాటండి..వాటిని సంరక్షించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడండి అని పలువురు వక్తలు పిలుపునిచ్చారు.. గురువారం మండల కేంద్రమైన పెద్దవడుగూరులో అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవాన్ని సుమంత్ ఎన్విరాన్మెంటల్ రూరల్ అగ్రికల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రజల్లో పర్యావరణ పరిరక్షణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మండల అధికారులు పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని ప్రజలకు వివరించారు. పర్యావరణ పరి రక్షణ కోసం ఆటవిసంపద పెంచాలని, విరివిగా మొక్కలు నాటి సంరక్షించాలని మండల విద్యాశాఖ అధికారి గురు ప్రసాద్ పిలుపునిచ్చారు. హౌసింగ్ ఏఈ నెట్టికంటయ్య మాట్లాడుతూ భూమిలో కరగని ప్లాస్టిక్ వాతావరణానికి ముప్పు తెస్తుందని, ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడం మంచిదని హితవుపలికారు. సుమంత్ ఎన్విరాన్మెంట్ సొసైటీ అధ్యక్షుడు వై. రామాంజనేయులు మాట్లాడుతూ మన నిర్లక్ష్యం వల్ల ఉన్న చెట్లను నరికి, కొత్తగా మొక్కలు నాటకపోవడంతో వాయు, ధ్వని, నీటి కాలుష్యం పెరిగి అనేక రకాల అనారోగ్యాలకు గురికావడం జరుగుతుందని అవేదన వ్యక్తం చేశారు.ఇంకా జన చైతన్య యువజన సంఘం కార్యదర్శి వెంకటరమణ, వివేకానంద యువజన సంఘం సూర్యనారాయణ, రంగ యువజన సంఘం రంగనాథ్ తదితరులు మాట్లాడుతూ పర్యావరణ కాలుష్యం వల్ల ఎన్నో అనర్థాలు వస్తున్నాయని అన్నారు. ప్లాస్టిక్ వాడకం తగ్గించాలని, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలని, అధికంగా బీడుభూములు, బోడి కొండలలో మొక్కలు నాటాలని ,అదే విధంగా ప్రతి ఇంటిముందు ఒక మొక్క నాటడం అందరి బాధ్యత అని గుర్తుచేశారు.

## అరుదైన వ్యాధివల్ల మృత్యువుతో పోరాడుతున్న యువకుడి

- ఆదుకోవాలని నిరుపేద కుటుంబం ఆర్తనాదం.



**పామిడి,జూన్04.అక్షర టైమ్స్:** మండల కేంద్రమైన పామిడీ పట్టణంలోని వెంగమనాయుడు కాలనీకి చెందిన మహమ్మద్ ఫారూఖ్ అనే యువకుడు అరుదైన, అత్యంత ప్రమాదకరమైన పెద్దపేగు ఇన్ఫెక్షన్‌తో మరణంతో పోరాడుతున్నాడు. గతంలో ఫ్లిప్‌కార్ట్ డెలివరీ బాయ్‌గా రాత్రింబగళ్లు కష్టపడుతూ కుటుంబాన్ని పోషించిన ఫారూఖ్, నేడు కదలలేని పరిస్థితిలో పూర్తిగా మంచానికే పరిమితమయ్యాడు. ఏడు నెలల క్రితమే తండ్రి మరణించడంతో, ఆ పుట్టెడు దుఃఖాన్ని గుండెల్లో దాచుకుని.. తల్లికి, ఇద్దరు ఆడపిల్లలకు తనే పెద్ద దిక్కుగా నిలబడ్డాడు ఫారూఖ్. కానీ, అంతలోనే ఈ ఘోరమైన వ్యాధి ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బతీసింది. ఇప్పటికే మూడు సార్లు శస్త్రచికిత్సలు జరిగి, పొట్ట భాగంలో ఒక ప్రత్యేక సంచిని ఏర్పాటు చేయడంతో ఆ యువకుడు పడుతున్న నరకయాతన వర్ణనాతీతం. మా అన్నయ్యే మా ప్రాణం,నాన్న లేని లోటు తెలియకుండా చూసుకున్న అన్నయ్యను ఇలా చూస్తుంటే గుండె పగిలిపోతోంది అని సోదరీమణులు ఏడుస్తుంటే, నా కొడుకు ప్రాణాలు కాపాడండి అంటూ ఆ మాతృమూర్తి కన్నీరుమున్నీరవుతూ చేతులు జోడించి వేడుకుంటోంది. ఫారూఖ్ మళ్లీ బ్రతకాలంటే మరో ప్రధాన శస్త్రచికిత్స చేయాలని, అందుకు 5 లక్షల నుండి 6 లక్షల వరకు ఖర్చవుతుందని వైద్యులు తేల్చి చెప్పారు.? ఇంటి దీపం ఆరిపోతుంటే చూస్తూ తట్టుకోలేకపోతున్నామని, దాతలు ఉదార హృదయంతో స్పందించి తమ బిడ్డను మరణం అంచుల నుండి కాపాడాలని ఆ కుటుంబం అపర్ణ హస్తాల కోసం ఎదురుచూస్తూ ప్రార్థిస్తున్నారు.ఆర్థిక సహాయం అందించదలచిన వారు క్రింది వివరాలను సంప్రదించవచ్చాలని, చరవాణి నెంబర్: 8309978798, కోరుకుంటున్నారు.

## గార్లదిన్నెలో వెన్నుపోటు ప్రభుత్వంపై దద్దరిల్లిన వైఎస్సార్సీపీ నిరసన గళం



**పామిడి/గార్లదిన్నె,జూన్04.అక్షర టైమ్స్:-** ప్రియతమ నాయకులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి డాక్టర్ సాకే శైలజనాథ్ సూచనలతో గురువారం మండల కేంద్రమైన గార్లదిన్నెలోని ప్రధాన కూడలిలో చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు నిరసన కార్యక్రమాన్ని అత్యంత విజయవంతంగా నిర్వహించడం జరిగింది. రెండు సంవత్సరాలు గడుస్తున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా, మోసాలు కుట్రలు ధఫ,అక్రమాలు,ప్రశ్నిస్తే అక్రమ కేసులు, కబ్జాలు, దౌర్జన్యాలు, దాదాగిరిలతో ప్రజలను నిలువునా ముంచిన మోసపూరిత కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా టీడీపీ మేనిఫెస్టోను,చంద్రబాబు,పవన్ కళ్యాణ్ సంతకాలు చేసిన బాండ్లు మరియు పత్రికా ప్రకటనల కాపీలను పార్టీ నాయకులు శ్రేణులు, కార్యకర్తలు మరియు ప్రజలు అందరూ కలిసి పెద్ద ఎత్తున హాజరై దహనం చేయడం జరిగింది.ఈ సందర్భంగా మండల నాయకులు మాట్లాడుతూ ప్రజాద్రోహ ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ నిలదీసేలా,ఈవెన్నుపోటు దినాన్ని మండలంలోని ప్రతి పల్లెకు చేరవేస్తామని, ప్రజలపక్షాన మనపోరాటం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేసిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, సోషల్ మీడియా సైనికులకు మరియు అభిమానులకు పేరుపేరునా ధన్యవాదాలుతెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, నారాయణరెడ్డి,చీమల శ్రీనివాసులు, గాంధీ, చిదంబరరెడ్డి పీరా ఎల్లప్ప రఘు పిల్లల కృష్ణ రామంజి చరణ్ కేశవయ్య విష్ణు ప్రసాద్ పుల్లమ్మ పుష్పావతి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి హామీలు గాలిలో కలిశాయి : ఇందుకూరు నారాయణరెడ్డి

- చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ర్యాలీ
- రెండేళ్ల కూటమి పాలనపై వైసీపీ విమర్శల వర్షం
- బాబు ఇచ్చిన హామీలు ఎక్కడ.?
- ముదిగుబ్బలో వైసీపీ ప్రశ్న

**ముదిగుబ్బ,జూన్04:.క్షర టైమ్స్:** కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో విఫలమైందని ఆరోపిస్తూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో "చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ ర్యాలీ చేపట్టి ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వైఎస్సార్‌సీపీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందుకూరు నారాయణరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన అనేక హామీలు ఇప్పటికీ అమలు కాలేదని విమర్శించారు. మహిళలకు ప్రకటించిన ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి, 50 ఏళ్లకే పింఛన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు అమలుకు నోచుకోలేదన్నారు. రైతులు అతివృష్టి, అనావృష్టి కారణంగా నష్టపోయినా పంట నష్టపరిహారం, క్రాప్ ఇన్సూరెన్స్ అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే ఉపాధ్యాయ నియామకాల ప్రక్రియలో అవకతవకలు జరిగాయంటూ నిరుద్యోగులు చేస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాలంటీర్ వ్యవస్థను రద్దు చేయడంతో ప్రజలు ప్రభుత్వ సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. చేతివృత్తిదారులు, ఆటో కార్మికులు, చిరు వ్యాపారులకు గతంలో అందిన సంక్షేమ పథకాలు నిలిచిపోవడంతో వారు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, ఉప కన్వీనర్ మీ సేవ చంద్ర, మాజీ సర్పంచ్ లక్ష్మీదేవి చెంద్రాయుడు, మాధవరెడ్డి, కోటేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, సుధాకర్‌రెడ్డి, కృష్ణయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి, రామాంజనేయులు, లోకేశ్వర్‌రెడ్డి, జయమ్మ, వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కదిరి రోడ్డులోని పెట్రోల్ బంక్ నుంచి బస్టాండ్‌లో ఉన్న దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ వెర్షన్ పత్రికల్లో ప్రచురించే వార్తా శైలికి దగ్గరగా ఉంటుంది.

## రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడుస్తున్న చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి రెండేళ్లు





**తాడిమర్రి,జూన్04.అక్షర టైమ్స్:** అసెంబ్లీ ఎన్నికల సమయంలో రాష్ట్ర ప్రజలకు అమలు చేయాలేని టీ వంటి హామీలను ఇచ్చి వెన్నుపోటు పొడిచి ఇప్పటికి రెండు సంవత్సరాలు గడిచిన సందర్భంగా వైఎస్ఆర్సిపి నాయకులు తాడిమర్రిలో గురువారం నిరసన ర్యాలీని నిర్వహించారు. వైఎస్ఆర్సిపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు టి.చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి రాష్ట్ర విభాగంయువజన ప్రధాన కార్యదర్శి మనోజ్ కుమార్ రెడ్డి. తాడిమర్రి మండల అధ్యక్షుడు పాటిల్ భువనేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వందలాది మంది కార్యకర్తలు పాల్గొన్నారు. చంద్రశేఖర్ రెడ్డి స్వగృహం నుంచి కార్యకర్తలు వెంట రాగా మెయిన్ బజార్ మీదుగా హైస్కూల్ వరకు జై జగన్ జై జగన్ అంటూ నినాదాలు చేస్తూ చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీగా వెళ్లారు.అక్కడినుండి బస్టాండ్ చేరుకొని వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళులుఅర్పించి మాట్లాడతు రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ కాలం ఒక స్వర్ణయగమని అలాగే జగన్మోహన్ రెడ్డి పరిపాలన పలువురికి ఆదర్శమని అనేక రాష్ట్రాలు జగన్ పరిపాలన చూసి నేర్చుకున్న అన్నారు,సూపర్ సిక్స్ పథకం చేపట్టి అమలు చేయలేక వెన్నుపోటు పొడిచారాన్నారు.రాష్ట్ర ప్రభుత్వం మోయలేని అమలు చేతకానినటువంటి పథకాలను ప్రకటించాడన్నారు రెండు సంవత్సరాల గడిచినప్పటికీ నిరుద్యోగ భృతి ఇవ్వలేదని,45 సంవత్సరాలు దాటిన మహిళలకు ఇస్తామన్న 15 వేల రూపాయలు ఇవ్వలేదన్నారు. అలాగే 2023 --24 సంవత్సరంలో బీటెక్ చదివిన విద్యార్థులకు ఫీజులు చెల్లించకుండా వెన్నుపోటు పొడవడం కదా అన్నారు,ఇలా సూపర్ సెక్స్ పేరుతో వెన్నుపోట్లు పొడిచి నేటికి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామని ఇప్పటికైనా రాష్ట్ర ప్రజలకు క్షమాపణ చెప్పి పథకాలు వెంటనే అమలు చేసి తమ పార్టీతో భేష్ అనిపించుకోవాలన్నారు రు, ఉచిత గ్యాస్ పథకం కంటిన్యూ చేయలేదని. చౌక ధాన్యపు డిపోలు కేంద్రం బియ్యం పంపిణీకి తప్ప మరే దానికి ఉపయోగపడలేదన్నారు, ఈ కార్యక్రమంలో సాయినాథ్ రెడ్డి మాజీ సర్పంచ్ అశ్వర్థ్. పుల్లయ్య ప్రకాష్ రెడ్డి. కన్వీనర్ బేల్దారు రామాంజనేయులు పలు గ్రామాల నుంచి వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## భారతీయ జనతా పార్టీ ధర్మవరం పట్టణ పదాధికారుల సమావేశం

- బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్



**ధర్మవరం,జూన్04.అక్షర టైమ్స్:** పట్టణంలో భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో పట్టణ పదాధికారుల సమావేశం బిజెపి నాయకులు నిర్వహించారు.ఈ సమావేశానికి జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణ అధ్యక్షుడు జింకా చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేసు, పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తదుపరి అంబటి సతీష్, షాకే ఓబులేష్, జింక చంద్రశేఖర్, గిర్రాజు నగేష్ మాట్లాడుతూ సమావేశంలో పార్టీ సభ్యత్వ విస్తరణ, బూత్ స్థాయి కమిటీల బలోపేతం, సంస్థాగత నిర్మాణం, కార్యకర్తల సమన్వయం మరియు రాబోయే పార్టీ కార్యక్రమాల విజయవంత నిర్వహణపై విస్తృతంగా చర్చించడం జరిగిందన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం జరిగిందన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 12 సంవత్సరాల సుపరిపాలనలో "నమ్మకం -- అభివృద్ధి -- ప్రజల సంక్షేమం" అనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా అంత్యోదయ భావనను సాకారం చేస్తూ, చివరి లబ్ధిదారునికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చేరేలా అనేక కార్యక్రమాలు అమలు చేశారని వివరించడం జరిగిందన్నారు. అలాగే ధర్మవరం కు సత్య కుమార్ యాదవ్ ఎమ్మెల్యేగా మంత్రిగా రావడం ధర్మం ప్రజల అదృష్టం అని చెప్పి సాంస్కృతి ఫౌండేషన్ తరపున ఎన్నో సేవా కార్యక్ర కార్యక్రమాలు నిర్వహించామన్నారు.అందులో ముఖ్యంగా మోకాళ్ళ ఆపరేషన్లు ఎంతో ఖర్చుతో కూడినటువంటి ఆపరేషన్లు కంటి ఆపరేషన్లు పదవ తరగతి విద్యార్థులు విద్యార్థులకు 2000 సైకిల్ పంపిణీ కార్యక్రమం జాబ్ మేళా నిర్వహించే 1800 మందికి జాబ్స్ ఇప్పించడం జరిగింది అని తెలిపారు. ఎన్నో సఇప్పటివరకు సీఎం రిలీఫ్ ఫండ్స్ 9 కోట్ల 43 లక్షల రూపాయలు అర్హులైన వారికి పంపిణీ చేయడం జరిగిందన్నారు.

**హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.**

రాష్ట్ర పార్టీ నిర్దేశించిన కార్యక్రమాలను కార్యకర్తలు ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకెళ్లాలని సూచించారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలోగుండా పుల్లయ్య, మైనారిటీ మోర్చా నాయకులు నబీ రసూల్, బిల్లే రవి, ఓబీసీ మోర్చా పట్టణ అధ్యక్షుడు మహేష్ ప్రజాపతి, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షుడు నాగభూషణ ఆచారి, జింకా ప్రవీణ్ కుమార్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పోరాల మహాలక్ష్మి, మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కోదూరు శారదమ్మ, ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు మంజులా భాయ్, అలాగే పార్టీ నాయకులు, మహిళా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ని ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలి

- పార్టీ శ్రేణులకు ధర్మవరం టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ సూచన
- ధర్మవరం పట్టణ, రూరల్ నాయకులతో ఎస్ఐఆర్ పై సమావేశం
- ప్రతి ఓటు కీలకమే.. క్షేత్రస్థాయిలో బలంగా పని చేయాలన్న శ్రీరామ్





**ధర్మవరం,జూన్04.అక్షర టైమ్స్:** కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సీరియస్ గా తీసుకోవాలని ధర్మవరం తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ పార్టీ శ్రేణులకు సూచించారు. ధర్మవరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆయన పట్టణ, రూరల్ మండలాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, కో కన్వీనర్లు, క్లస్టర్, యూనిట్ ఇన్ ఛార్జిలు, బూత్ కన్వీనర్లు, బూత్ లెవెల్ ఏజెంట్స్, వార్డ్ కమిటీ అధ్యక్షులతో పాటు ముఖ్యనాయకులంతా పాల్గొన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఈ కార్యక్రమం ఈనెల 15వ తేది నుంచి చేపట్టబోతోందని కావున క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతీ 20-25 ఏళ్లకోసారి స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ జరుగుతుందని.. 2002 ఓటర్ల జాబితాను పరిగణనలోకి తీసుకుని స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ ప్రక్రియను చేస్తున్నారన్నారు. జులై 14వ తేదీలోగా రెండుసార్లు ఓట్ల మ్యాపింగ్ చేస్తారని వివరించారు. ఎస్ఐఆర్ జరుగుతున్న సమయంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. జులై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు ఇంటింటి ప్రచారం చేపట్టాల్సి ఉంటుందన్నారు. దీని పట్ల నిర్లక్ష్యంగా ఉంటే మనకు సంబంధించిన ఓట్లు పోయే ప్రమాదం ఉందన్నారు. ఓట్ల ఎన్‌రోల్‌మెంట్ జరుగుతోందని తెలిపారు. ఓట్ల చేరికలపై ప్రజలకు అవగాహన కల్పించడం రాజకీయ పార్టీగా మన ప్రాథమిక బాధ్యత అని తెలిపారు. ఏ ఎన్నికలకైనా ఓటర్ల జాబితా అనేది చాలా కీలకమని అన్నారు. గడిచిన ఎన్నికల్లో పని చేసిన విధంగానే స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా మనం పని చేయాల్సి ఉంటుందన్నారు. ఇప్పటికే మంత్రి నారా లోకేష్ పర్యటన, మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేశామని.. దీని ద్వారా ధర్మవరంలో పార్టీ సత్తా ఏంటన్నది తెలిసిందన్నారు. ఇప్పుడు ఎస్ఐఆర్ ను కూడా అంతే సీరియస్ తీసుకుని పని చేయాలని శ్రీరామ్ సూచించారు.

## ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలి జిల్లా ఎస్పీ

- ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామంలో పర్యటించిన జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ ఐపీఎస్





**ధర్మవరం,జూన్04.అక్షర టైమ్స్:** శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ ఎస్. సతీష్ కుమార్, ఐపీఎస్ గురువారం సాయంత్రం ధర్మవరం మండలంలోని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామమైన ఒబులనాయనపల్లి గ్రామాన్ని సందర్శించి శాంతి భద్రతల పరిస్థితిని సమీక్షించారు. గ్రామంలో పర్యటించిన ఎస్పీ గ్రామస్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలు, అభిప్రాయాలు తెలుసుకున్నారు.ముఖ్యంగా మహిళలతో ప్రత్యేకంగా సమావేశమై గ్రామంలోని పరిస్థితులు, ప్రజా సమస్యలు, జీవన విధానంలో వచ్చిన మార్పుల గురించి ఆరా తీశారు.ప్రజలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వేధింపులు, సంఘ వ్యతిరేక కార్యకలాపాలు, మద్యం కారణంగా ఏర్పడే సమస్యలు లేదా ఇతర శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.గ్రామస్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఫ్యాక్షన్ గొడవలు, వ్యక్తిగత కక్షలు, కుటుంబ విభేదాలు సమాజ అభివృద్ధికి ఆటంకం కలిగిస్తాయని, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తాయని తెలిపారు. సమస్యలను చట్టబద్ధంగా, శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాలని, హింసాత్మక చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు.యువత చెడు స్నేహాలు, నేర కార్యకలాపాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, నేరాల్లో పాల్గొనడం వల్ల విద్య, ఉపాధి మరియు భవిష్యత్ అవకాశాలపై ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరించారు.తల్లిదండ్రులు తమ పిల్లలను విద్య, మంచి విలువలు, ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సహించాలని సూచించిన ఎస్పీ, గ్రామాల్లో శాశ్వత శాంతి, అభివృద్ధి ప్రజల సహకారంతోనే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించే అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.అనంతరం ధర్మవరం రూరల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించి, పోలీసు సిబ్బంది ప్రజలకు మరింత బాధ్యతాయుతంగా, వృత్తిపరమైన నిబద్ధతతో సేవలందించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ధర్మవరం రూరల్ సీఐ ప్రభాకర్, ఎస్సై రాజశేఖర్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, మహిళలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఉత్తమ బోధనకు ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు

- ఎంఈఓ లు రాజేశ్వరి దేవి
- గోపాల్ నాయక్



**ధర్మవరం,జూన్04.అక్షర టైమ్స్:** ప్రభుత్వ ఆదేశాను ప్రకారం ఫౌండేషన్ లిట్రసి అండ్ న్యూమరికల్ ట్రైనింగ్ 6రోజుల డివిజనల్ స్థాయిలో ధర్మవరం సెంటర్లో ఏడు మండలాలలో ఒకటవ, రెండవ తరగతి లకు బోధించు ఉపాధ్యాయు లకు పట్టణంలోని సుందరయ్య నగర్ లో గల శ్రీ గణపతి మున్సిపల్ ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని ఎంఈఓ లు రాజేశ్వరి దేవి, గోపాల్ నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయుటకు ఉపాధ్యాయులందరికీ కూడా ఈ పునఃచరణ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా సాంకేతిక అందిపుచ్చుకొని విద్యార్థులకు బోధన కల్పించవలసిన అవసరం ఉంటుంది అని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి ప్రజల్లో ప్రభుత్వ పాఠశాల పట్ల ఒక నమ్మకాన్ని కలిగించాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. ఈ సెంటర్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం 5 వరకు జరుగుతున్నదని, మొత్తం డివిజన్లోని 333 మంది హాజరు కావడం జరిగిందన్నారు. ఇందులో ప్రతి టీచర్ పాల్గొని వాళ్ళ పాఠశాలలకు వెళ్లి పాఠశాలలో ఉన్నటువంటి విద్యార్థిని విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ సంబంధించినటువంటి సామర్థ్యాలు అన్నీ కూడా సాధించి పిల్లలకు ఉపయోగపడే విధంగా బోధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏ ఎస్ ఓ పని రాజ్ శర్మ , కేఆర్పీ జయరాం రెడ్డి డిఆర్పిలు , సీఎంఆర్టీలు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కరయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా

- కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి



**ధర్మవరం,జూన్04.అక్షర టైమ్స్:** పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు నందు గల శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల నందు జూన్ 6వ తేదీ శనివారం శ్రీ వివేకానంద డిగ్రీ కళాశాల,నిర్మాణ్ ఆర్గనైజేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ ఐటీ కంపెనీ ప్రతినిధులచే జాబ్ మేళా నిర్వహిస్తున్నామని కళాశాల కరస్పాండెంట్ భాస్కర్ రెడ్డి, డైరెక్టర్ బాలం లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రిన్సిపాల్ కరణం హర్షవర్ధన్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ధర్మవరం పరిసర ప్రాంతాలలోని నిరుద్యోగ యువతి యువకులకు వరుసగా రెండవ సంవత్సరం జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని, ఈ జాబ్ మేళాకు డిగ్రీ లేదా బిటెక్ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులు అని వారు తెలిపారు. ఎంపికైన వారికి 2 లక్షల 40 వేల రూపాయలు నుండి 5 లక్షల వరకు వేతన ప్యాకేజీ అందిస్తారని,అభ్యర్థులకు హైదరాబాద్, చెన్నై , బెంగుళూరు నందు ఉద్యోగ నియామకాలు ఉంటాయని వారు తెలిపారు . మేళాకు హాజరుకాదలచిన అభ్యర్థులు రెండు సెట్ల డిగ్రీ లేదా బిటెక్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, మూడు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, రెజ్యూమ్ లతో హాజరు కావాలని తెలిపారు.కావున ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9912679876,9052984089 నెంబర్లను సంప్రదించవలసిందిగా వారు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఇంచార్జి రమేష్, ఎన్ఎస్-ఎస్ ఆఫీసర్ శ్రీనివాసులు,అకడమిక్ అకడమిక్ ఇంచార్జి కృష్ణయ్య, ప్లేస్మెంట్ ఆఫీసర్ జయకృష్ణ, అధ్యాపక బృందం విద్యార్థులు పాల్గొన్నారు .

# చలి పంజాకు గురికాకుండా



సాధారణంగానే శీతకాలంలో రోగ నిరోధక శక్తి తగ్గితుంది. మరీ ముఖ్యంగా గర్భిణులపై చలి తీవ్ర ప్రభావం చూపుతుంది. జలుబు, దగ్గుతోపాటు కీళ్లు పట్టేయడం, పొడిచర్మం వంటి సమస్యలు వారిని ఇబ్బంది పెడతాయి. కొన్ని చిన్న జాగ్రత్తలు తీసుకుంటే.. చలికాలంలో గర్భిణులు ఇబ్బంది పడకుండా ఉంటారని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. చలి వాతావరణం, పదేపదే మూత్రానికి వెళ్లాల్సిరావడం వల్ల.. ఈ కాలంలో గర్భిణులు నీళ్లు తక్కువగా తాగుతుంటారు. దాంతో డీహైడ్రేషన్ బారిన పడతారు. అయితే, గర్భిణుల్లో డీహైడ్రేషన్ చాలా ప్రమాదకరంగా పరిణమిస్తుంది. శరీరంలో తగినంతగా నీటి స్థాయిలు లేకపోతే.. ఉమ్మనీరు తగ్గిపోయే ప్రమాదం ఉంటుంది. ఇది బిడ్డ ఎదుగుదలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పరిస్థితి అలాగే కొనసాగితే.. ముందస్తు డెలివరీ అయ్యే అవకాశం ఉంటుంది. కాబట్టి.. ఏ కాలమైనా తగిన మోతాదులో నీళ్లు తాగడం మంచిది. ఈ కాలంలో చర్మం పొడిబారడం సహజం. ఇక గర్భిణుల్లో పొట్ట పెరిగేకొద్దీ చర్మం సాగుతూ ఉంటుంది. దాంతో చర్మం పగిలి.. ఆ ప్రదేశంలో దురద పెడుతుంది. చలికాలంలో ఈ సమస్య మరింత ఎక్కువ అవుతుంది. అందుకే.. వైద్యుల సూచన మేరకు ప్రత్యేక క్రీములు, లోషన్లు, నూనెలు రాసుకోవాలి. రోజుకు ఒకటి రెండుసార్లు పొట్ట భాగంలో నెమ్మదిగా మసాజ్ చేసుకోవాలి. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగవడంతోపాటు చర్మం తేమగా ఉంటుంది. ప్రసవం తర్వాత స్ట్రెచ్‌మార్క్స్ రాకుండా కూడా తోడ్పడుతుంది. చలికాలంలో వేధించే మరో ప్రధాన సమస్య.. కీళ్లనొప్పులు. చలి గాలులకు శరీరంలోని రక్తనాళాలు కుంచించుకుపోయి.. రక్త ప్రసరణ నెమ్మదిస్తుంది. దాంతో కండరాలు, కీళ్లు బిగుసుకుపోతాయి. గర్భిణులను ఈ సమస్య మరింత ఎక్కువగా వేధిస్తుంటుంది. దీనినుంచి బయటపడేందుకు.. వైద్యుల సలహా మేరకు నిపుణుల ఆధ్వర్యంలో 'అరోమా థెరపీ' చేయించుకోవడం మంచిది. లావెండర్, టీ ట్రీ, యూకలిప్టస్ వంటి నూనెలతో శరీరాన్ని సున్నితంగా మసాజ్ చేయించుకోవాలి. దీనివల్ల రక్త ప్రసరణ మెరుగవుతుంది. శారీరక నొప్పుల నుంచి ఉపశమనం కలుగుతుంది.

# ఫ్యాషన్ రంగవల్లిక బంజారా అల్లిక



దుస్తులంటే నాగరికత. ఆ దుస్తులే అస్తిత్వ పతాకలు. రంగులే అభిరుచుల వ్యక్తీకరణ. ఆహార్యమే గుర్తింపు, గౌరవం, వారసత్వం. అవన్నీ కోల్పోతే పరాయీకరణే. రంగురంగుల హంగులు ఉండే వస్త్రశ్రేణితో అలరించిన నిన్నటి తరం బంజారాలు.. కాల ప్రవాహంలో తమ ఆహార్యాన్ని కోల్పోయారు. ఈ నేపథ్యంలో గతించిన వైభవాన్ని తిరిగి తీసుకురావడమే కాదు.. ఆ బంజారాల వస్త్ర సౌందర్యాన్ని ఆధునిక దుస్తులకు ఆపాదిస్తున్నది బంజారా కసూతి సంస్థ. లంబాడీ మహిళలను ఆత్మన్యూనత నుంచి ఆత్మగౌరవం వైపు నడిపిస్తున్నది. తెలంగాణలో లంబాడీలు ఉన్నట్టే.. కర్ణాటకలోనూ ఉన్నారు. వీరిని లంబానీలు అని పిలుస్తారు. ప్రాంతం వేరైనా వీరి కట్టూ, బొట్టూ ఒకేలా ఉంటుంది. విజయపుర ప్రాంతంలో లంబాడీ సామాజిక వర్గానికి చెందినవాళ్లు అధిక సంఖ్యలో ఉంటారు. ఇక్కడి మహిళలు చూపు తిప్పుకోలేనంత అందమైన దుస్తులు, ఆభరణాలను నిండుగా ధరించేవారు. ఒకప్పుడు వీరి ఆహార్యం చూడగానే బంజారాలని గుర్తుపట్టేవాళ్లు. కానీ, ఇప్పుడు తలపై నుంచి జారుతూ ఉండే అద్దాల అంచుల టుక్రీ మెరుపులు లేవు. సంప్రదాయ గాగ్రీ (లెహంగా) కూడా ధరించట్లేదు. కాంక్లీ (రవిక లాంటిది), దాని పైనుంచి వేసుకునే ఆభరణాలు కూడా దాదాపు కనుమరుగయ్యాయి. గాగ్రీ బదులు చీర కట్టుకుంటున్నారు. ఒకప్పుడు వస్త్రధారణ వల్ల ప్రత్యేకంగా కనిపించే ఈ బంజారా బిడ్డలు సాధారణ ప్రజల్లో కలిసిపోయారు. అందరిలా ఉండాలన్న కోరిక వాళ్లకు లేదు. సంప్రదాయ వస్త్రధారణ పట్ల ప్రేమ తప్ప వ్యతిరేకత లేదు. వారసత్వ కళ మీద మమకారమే కానీ ఛీత్కారం లేదు. వారికి లేనిదల్లా ఉపాధే! డబ్బే అన్నిటినీ శాసిస్తున్న ఈ కాలంలో వారి జీవన సౌందర్యం కనుమరుగైపోయింది.

## కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

– నీట్ పేపర్ లీకేజీ పై సమగ్రమైన విచారణ జరిపి నేరస్థలపై కఠినమైన చర్యలు తీసుకోవాలి..

– ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున



**ధర్మవరం,జూన్04.అక్షర టైమ్స్:** కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని, నీట్ పేపర్ లీకేజీ పై సమగ్రమైన విచారణ జరిపి నేరస్తులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నామాల నాగార్జున డిమాండ్ చేశారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం విద్య వ్యాపారం చేయడమే లక్ష్యంగా పెట్టుకొని దేశవ్యాప్తంగా అనేక మైనటువంటి ప్రముఖ పరీక్షలు సందర్భంగా పేపర్ లీకేజీ వ్యవహారం జరగడం దారుణం అన్నారు. ఇప్పటికే దేశవ్యాప్తంగా గత పది సంవత్సరాల కాలంలో 29 పరీక్ష పేపర్లు లీక్ కావడం జరిగింది అని, 48 పరీక్షలు రీ ఎగ్జామ్స్ నిర్వహించడం జరిగిందన్నారు.దేశవ్యాప్తంగా ఎంతో ప్రాముఖ్యత కలిగినటువంటి నీట్ పరీక్ష 23 లక్షల మంది విద్యార్థులు రాస్తే చివరికి పరీక్ష లీకేజ్ అయిందని పరీక్ష రద్దు చేయడం జరిగింది దీని కారణంగా దేశవ్యాప్తంగా 8 మంది విద్యార్థులు ఆత్మహత్య కు పాల్పడడం బాధాకరమన్నారు. దీనిపై సమగ్రమైన విచారణ జరపడం గాని లేదా చర్యలు తీసుకోవడంలో కానీ కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫ్లవం కావడం జరిగింది అని తెలిపారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి నీట్ పరీక్ష లీకేజ్ పై సమగ్రమైన విచారణ చేసి దోషులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి అని లేడీ ఎడల ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాలు సలుపుతామని కేంద్ర ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అమన్,బాలాజీ, అనిల్,కిట్టు,సాయిచరణ్ తదితరులు పాల్గొన్నారు.


# బానిస సంకెళ్ల విముక్తికి రెండేళ్లు

– గోనుగుంట్ల భూషణ్ ఉమ్మడి జిల్లా సర్పంచ్ల సంఘం అధ్యక్షులు



**తాడిమర్రి,జూన్04.అక్షర టైమ్స్:** రాష్ట్ర ప్రజలు బానిస బతుకుల నుండి బయటపడి రెండు సంవత్సరాల పూర్తయిందని ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు గోనుగుంట్ల భూషణ్ అన్నారు కనీవినీ ఎరుగని రీతిలో మెజార్టీ సాధించి రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ విజయదుంది మోగించిన సందర్భంగా నిడిగల్లు గ్రామంలో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు ఈ సందర్భంగా గోనుగుంట్ల భూషణ్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల ప్రకారం సూపర్ సిక్స్ ను మొదటి ఏడాదిలోపే అమలు చేసిన ఘనత రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు వైసీపీ నాయకులకు ఈ విషయం తెలియక నానా యాగి చేస్తున్నారన్నారు వైసిపి అధికారంలో ఉన్న ఐదు సంవత్సరాల కాలంలో ఒక్క డీఎస్సీని కూడా జరపలేదు కానీ కూటమి ప్రభుత్వం మాత్రం మెగా డీఎస్సీ జరిపి ఉద్యోగాలు కల్పించింది ఎన్టీఆర్ భరోసా పట్టణం కింద పెన్షన్లు మొత్తం పెంపు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉచితంగా మూడు సిలిండర్లు రైతులకు రైతు నేస్తం పథకం కింద 20 వేల రూపాయలు వర్తింపు ప్రవేశపెట్టిన ఘనత రాష్ట్ర ప్రభుత్వాన్నిదని వైసీపీ తెలుసుకోవాలన్నారు కానీ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు వైసీపీ నానాయోగి చేస్తోంది. గతంలో అన్యాయం పాలైన వారు రాష్ట్ర ప్రభుత్వం చేతిలో బంగపడ్డవారు ఎవ్వరు కూడా బయటకు వచ్చి మాట్లాడలేని పరిస్థితి ఉండేది ఇప్పుడు ప్రతి ఒక్కరూ స్వేచ్ఛాయుతంగా సమస్యల పరిష్కారం ప్రయత్నిస్తున్నారు ఈ కార్యక్రమంలో స్టోర్ డీలర్ కాకర్ల చంద్రశేఖర్ యూనిట్ ఇన్చార్జ్ ముత్తులూరు రాజశేఖర్ వైస్ సర్పంచ్ ధనప్ప రామకేశవులు తదితరులు పాల్గొన్నారు

# సీఎం ఎంపికలో చారిత్రక తప్పిదం



పురాతన పార్టీగా పేరున్న కాంగ్రెస్ దేశంలోని మూడు రాష్ట్రాల్లో మాత్రమే సొంతంగా అధికారంలో ఉన్నది. వాటిలో దక్షిణాది రాష్ట్రాలైన కర్ణాటక ఒకటైతే, అతికష్టం మీద అధికారంలోకి వచ్చిన తెలంగాణ రెండవది. పద్నాలుగేండ్ల పాటు ఉద్యమాన్ని నడిపించి, మరో పదేండ్లు ప్రభుత్వంలో ఉన్న బీఆర్ఎస్‌ను కాదని తెలంగాణ ప్రజలు కాంగ్రెస్‌కు అవకాశం ఇచ్చారు. కానీ, ఆ పార్టీ అధిష్ఠానం ముఖ్యమంత్రి ఎంపికలో చారిత్రక తప్పిదం చేసినట్టు కనిపిస్తున్నది. రాష్ట్రంలోని మిగతా సీనియర్ నాయకులను కాదని ఓటుకు నోటు కేసులో చిక్కుకున్న రేవంత్‌రెడ్డిని ముఖ్యమంత్రి పీఠంపై కూర్చోపెట్టడం ఆ పార్టీ చేసిన అతి పెద్ద తప్పిదంగా మారింది. కనీసం మంత్రిగా కూడా అనుభవం లేని రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ముఖ్యమంత్రిగా ఎలాంటి మార్పులు తీసుకురాకపోగా రాష్ట్రంలో కక్షపూరిత రాజకీయాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకుల అరెస్టులు, సోషల్ మీడియా వ్యాఖ్యలపై పోలీసు కేసులు ఆ పార్టీ ప్రతిష్ఠను దిగజార్చుతున్నాయి. ముఖ్యంగా గత ప్రభుత్వంపై కక్షగట్టి కేసీఆర్, కేటీఆర్ లాంటి నాయకులపై ఉన్న కోపాన్ని తీర్చుకోవడానికి ప్రభుత్వాన్ని వాడుకుంటున్నారు. 'ఫార్ములా-ఈ' కార్ రేసు కేసులో కేటీఆర్‌ను అరెస్టు చేయాలనే ఆతృతతో ఉన్న రేవంత్‌రెడ్డి ఎంతకైనా దిగజారేందుకు ప్రయత్నిస్తున్నారు. కేటీఆర్ లాంటి నాయకుడిని అరెస్టు చేసి ప్రతిపక్ష పార్టీల కార్యకర్తలను భయపెట్టాలని చూస్తున్న ఆయన ప్రయత్నాలు ఏ మాత్రం సఫలం కావడం లేదు. ఇవన్నీ కాంగ్రెస్ పరువును దిగజార్చుతున్నాయి. ఒక జాతీయ పార్టీ నేత, రాష్ట్ర ముఖ్యమంత్రి ఇలా దిగజారడం ఇదే మొదటిసారి కావచ్చు. ఇలాగే తన వ్యక్తిగత ప్రయోజనాలు, రాజకీయ వైషమ్యాల కోసం ఇలాగే సమయం వృథా చేస్తే ఆ నష్టం కేవలం కాంగ్రెస్ పార్టీకే కాదు ఈ రాష్ట్ర ప్రజలకు కూడా జరుగుతుంది. ఇక తెలంగాణ ఉద్యమ చిహ్నాలను, రాష్ట్ర సంస్కృతీ సంప్రదాయాలను మార్చే ఉద్దేశంతో ఉన్న ఆయన మొదట రాజముద్రను మార్చాలని ప్రయత్నించి భంగపడ్డారు. తర్వాత టీఎస్ స్థానంలో టీజీని తీసుకొచ్చారు. ఇలా పేర్లు, చిహ్నాల మార్పులపై తీవ్ర విమర్శలు ఎదుర్కొన్న ఆయన జాతీయస్థాయిలో బీజేపీపై కాంగ్రెస్ చేస్తున్న పోరాటాలకు, విధానాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన వైఖరితో జాతీయస్థాయిలో కాంగ్రెస్ పరువు పల్చనయ్యే అవకాశం ఉన్నది. ఇక, ఎన్నికల ముందు ఇచ్చిన హామీల అమలు విషయంలోనూ రేవంత్‌రెడ్డి విఫలమయ్యారు. ఇప్పటివరకు రుణమాఫీ పూర్తికాలేదు. దానికోసం ఆశగా ఎదురు చూసిన రైతులు ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమవుతున్నారు. ఎకరాకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి, ఇప్పుడు రూ.12వేలు మాత్రమే ఇస్తామని స్పష్టం చేశారు. ఇలా హామీలు ఇచ్చి అమలు చేయలేకపోతే రేవంత్‌రెడ్డి మాత్రమే వ్యక్తిగతంగా బాధ్యుడు కాదు, ఆ పార్టీ జాతీయ నాయకత్వం కూడా బాధ్యత వహించాల్సి ఉంటుంది. లేదంటే తెలంగాణలోనే కాదు, మరే రాష్ట్రంలోనూ ప్రజలు ఆ పార్టీని నమ్మరు. అంతెందుకు మహారాష్ట్రలో కాంగ్రెస్ హామీలను ఎవరూ పట్టించుకోలేదు. తెలంగాణలో అమలు చేయని హామీలు తమకెందుకని అక్కడి ప్రజలు కాంగ్రెస్ పార్టీని తిరస్కరించారు. హామీల అమలుపై కంటే కక్ష రాజకీయాలపై దృష్టిపెడితే ఫలితాలు ఇలాగే ఉంటాయని గ్రహించిన ఆ పార్టీ మహారాష్ట్రలో కర్ణాటక, తెలంగాణ హామీల మాట ఎత్తొద్దని నాయకులకు నిర్దేశించింది. చివరికి కాంగ్రెస్ పార్టీ జరిపిన విజయోత్సవాలకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రావడానికి సుముఖత చూపలేదంటే రేవంత్ సారథ్యంలోని ఆ పార్టీ ఏ మేరకు విజయం సాధించిందో మనం అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది కాలంలో అసలు తెలంగాణలో కనిపించదగిన మార్పేమీ రేవంత్‌రెడ్డి తీసుకురాలేకపోయారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామన్న ఆయన ఏడాది గడుస్తున్నా ఇంకా మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఏదైనా జాతీయ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే మిగతా రాష్ట్రాల్లోనూ చెప్పుకొని ప్రచారం చేసుకుంటుంది. కానీ, తెలంగాణ విషయంలో మాత్రం ఆ పార్టీ జాతీయ నాయకత్వం చెప్పుకోవడానికి సంకోచిస్తున్నది. మామూలుగా కాంగ్రెస్‌కు ముఖ్యమంత్రులను మార్చే అలవాటు ఉన్నది. కానీ, ఎదురుచూసి నిర్ణయం తీసుకుందామన్న ఆలోచనలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి రేవంత్ దూకుడు మనస్తత్వం వల్ల ఇబ్బందులు కలుగుతున్నాయి. అధిష్ఠానం సూచనలను తెలంగాణ పాలకులు ఏ మాత్రం పట్టించుకోవట్లేదన్న విమర్శలున్నాయి. మిగతా నాయకులతో అంటీముట్టనట్టు వ్యవహరించడం వల్ల ఆయనపై అధిష్ఠానం గతంలో సీరియస్ అయిన విషయం అందరికీ తెలిసిందే. రూ.15 వేల రైతు భరోసాపై వెనక్కి తగ్గడంపై క్యాబినెట్ సహచరుల సూచనలను ఆయన పట్టించుకున్నట్టు కనిపించలేదు. సంక్షేమ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నామని చెప్పుకొంటున్న రేవంత్‌రెడ్డికి ప్రతిపక్షాలు చేస్తున్న పోరాటాలకు ప్రజల మద్దతు విశేష స్థాయిలో ఎందుకు ఉంటుందన్న విషయాన్ని గ్రహించడం లేదు. లగచర్ల సహా ప్రతిపక్షాలు చేసే ఏ పోరాటాలకైనా ప్రజలు భారీగా మద్దతునిస్తున్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఆమె అమలుచేసిన సం క్షేమ పథకాలా? లేదంటే ఆమె విధించిన ఎమర్జెన్సీ నా? అన్న విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ ఆలోచించుకోవాలి. తెలంగాణలో ఎలాగూ విశ్వాసం కోల్పోయింది. ఇప్పటికైనా తెలంగాణలోని నాయకత్వానికి కాంగ్రెస్ అధిష్ఠానం సరైన మార్గ నిర్దేశం చేయకపోతే మిగతా రాష్ట్రాల్లోనూ ఆ పార్టీకి అదే గతి పడు తుంది. ఇందులో అనుమానం లేదు.

# మీ కాళ్లు బలహీనంగా ఉన్నాయా వీటిని తినండి.. దృఢంగా మారుతాయి



శరీరంలోని అన్ని అవయవాలు బలంగా ఉంటేనే మనం ఆరోగ్యంగా ఉంటాం. ప్రతి ఒక్క అవయవం ఆరోగ్యంగా, దృఢంగా ఉంటేనే శరీరం మొత్తం ఆరోగ్యంగా ఉంటుంది. ఈ క్రమంలోనే కొందరు శరీరం ఎంత దృఢంగా ఉన్నప్పటికీ కాళ్లు బలహీనంగా ఉంటాయి. అడుగు తీసి అడుగు వేయడం కష్టంగా ఉంటుంది. అలాగే కండరాల నిర్మాణం కూడా సరిగ్గా ఉండదు. దీంతో పాదాల నొప్పులు వస్తుంటాయి. అయితే సరైన ఆహారం తీసుకుంటే శరీరంలోని అవయవాలు ఆరోగ్యంగా ఉంటాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉండి కండరాల నిర్మాణం జరగాలంటే ప్రోటీన్లు అధికంగా ఉండే ఆహారాలను తినాల్సి ఉంటుంది. పలు ఆహారాలను తరచూ తీసుకోవడం వల్ల కాళ్లను దృఢంగా ఉంచుకోవచ్చు. కాళ్లలో ఉండే కండరాలు కూడా ఆరోగ్యంగా ఉంటాయి. ఇక అందుకు ఏమేం ఆహారాలను తినాలో ఇప్పుడు తెలుసుకుందాం.

**చికెన్..**

చికెన్‌ను చాలా మంది ఎంతో ఇష్టంగా తింటారు. అయితే చికెన్‌లో లెగ్ పీస్‌లను తింటుంటారు. ప్రోటీన్లు కావాలంటే చికెన్ బ్రెస్ట్ పీస్‌లను తినాలి. లెగ్ పీస్‌లకు కొవ్వు బాగా ఉంటుంది. కనుక లెగ్ పీస్‌లను తినకూడదు. బ్రెస్ట్ పీస్‌లలో ప్రోటీన్లు ఉంటాయి. కనుక బ్రెస్ట్ పీస్‌లను తింటే కండరాలకు బలం కలుగుతుంది. ముఖ్యంగా కాళ్లలో ఉండే కండరాలు నిర్మాణం అవుతాయి. కండరాలు దృఢంగా మారుతాయి. అదేవిధంగా పెరుగును ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల శరీరానికి శక్తి లభిస్తుంది. దీంతోపాటు కండరాలకు బలం కలుగుతుంది. పెరుగును తింటున్నా కూడా కాళు బలంగా మారుతాయి. ఆరోగ్యంగా ఉంటాయి. పెరుగులో ఉండే ప్రొబయోటిక్ ఆహారాలు, ప్రోటీన్లు కండరాలకు మేలు చేస్తాయి. కనుక పెరుగును రోజూ తినాలి.


**పనీర్..**

పనీర్‌ను కూడా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. పనీర్ ద్వారా మనకు ప్రోటీన్లు సమృద్ధిగా లభిస్తాయి. దీంతో కండరాల నిర్మాణం జరుగుతుంది. కాళ్లు బలహీనంగా ఉన్నవారు పనీర్ ను ఆహారంలో భాగం చేసుకోవడం వల్ల కాళ్లలోని కండరాలు దృఢంగా మారుతాయి. కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అలాగే పాలకూరను తినడం వల్ల కూడా కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. దీని వల్ల శరీరానికి కావల్సిన క్యాల్షియం లభించడంతోపాటు ప్రోటీన్లు కూడా అందుతాయి. దీంతో కాళ్లు దృఢంగా మారుతాయి. అలాగే కాళ్లు బలంగా మారాలంటే చిలగడదుంపలను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ప్రోటీన్లను, శక్తిని అందిస్తాయి.

**చియా విత్తనాలు..**

ఇక సముద్రపు చేపలను కూడా తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలి. వారంలో కనీసం 2 నుంచి 3 సార్లు ఈ చేపలను తింటే మంచిది. దీంతో మన శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కండరాల నిర్మాణానికి ఎంతగానో దోహదం చేస్తాయి. దీంతో కాళ్లు దృఢంగా, ఆరోగ్యంగా మారుతాయి. అలాగే క్వినోవాను కూడా తినవచ్చు. ఇవి శరీరానికి ఎంతో శక్తిని అందిస్తాయి. కండరాలు నిర్మాణం అయ్యేలా చేస్తాయి. ప్రోటీన్లను అందిస్తాయి. దీని వల్ల కాళ్లు ఆరోగ్యంగా ఉంటాయి. అదేవిధంగా చియా విత్తనాలను కూడా తినవచ్చు. ఇవి మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. శరీరానికి కావల్సిన ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు లభిస్తాయి. ఇవి కాళ్లను బలంగా మారుస్తాయి. ఇలా పలు రకాల ఆహారాలను తినడం వల్ల కాళ్లు బలంగా మారుతాయి. శరీరానికి కూడా శక్తి లభిస్తుంది.

# రాత్రి భోజనం అనంతరం కడుపు ఉబ్బరంగా ఉంటుందా అయితే అందుకు కారణాలు ఇవే



ప్రస్తుత తరుణంలో జీర్ణ సమస్యలు అనేవి చాలా మందికి కామన్ అయిపోయాయి. అప్పుడే పుట్టిన శిశువులు కూడా జీర్ణ సమస్యల బారిన పడుతున్నారు. గ్యాస్, అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్దకం, గుండెల్లో మంటగా అనిపించడం.. ఇలాంటివన్నీ జీర్ణ సమస్యలుగా చెప్పవచ్చు. అయితే వీటిల్లో ఒకటి వచ్చిందంటే మిగిలినవి కూడా ఆటోమేటిగ్గా వచ్చేస్తాయి. కనుక ఏ జీర్ణ సమస్య వచ్చినా దాన్ని తగ్గించుకోవాలి. లేదంటే సమస్య మరింత తీవ్రతరం అవుతుంది. ఇక చాలా మందికి రాత్రి పూట భోజనం చేసిన అనంతరం కడుపు ఉబ్బరంగా ఉంటుంది. దీంతోపాటు ఇతర జీర్ణ సమస్యలు కూడా వస్తుంటాయి. అయితే ఇందుకు పలు ప్రధాన కారణాలు ఉంటాయి. అవేమిటో ఇప్పుడు తెలుసుకుందాం.

**కొవ్వు పదార్థాలను తినడం..**

రాత్రి పూట చాలా మంది కొవ్వు పదార్థాలను తింటుంటారు. అయితే వీటిని రాత్రి పూట తినకూడదు. రాత్రి భోజనంలో కొవ్వు పదార్థాలను తింటే అవి సరిగ్గా జీర్ణం కావు. పేగుల్లో కదలికలు సరిగ్గా ఉండవు. జీర్ణాశయంలోనే కొవ్వు పదార్థాలు ఎక్కువ సమయం పాటు ఉంటాయి. ఇలా దీర్ఘకాలంలో రాత్రి పూట కొవ్వు పదార్థాలను తినడం వల్ల కడుపు ఉబ్బరం వస్తుంది. దీన్ని అజీర్తి కారణంగా వచ్చిన కడుపు ఉబ్బరం అని చెప్పవచ్చు. ఆహారం సరిగ్గా జీర్ణం కాకపోతే ఈరకంగా కడుపు ఉబ్బరం వస్తుంది. ఇక కొందరికి పాలు లేదా పాల ఉత్పత్తులు పడవు. పాలలో ఉండే లాక్టోజ్ అనే పదార్థం కారణంగా ఆయా ఉత్పత్తులను తీసుకున్నప్పుడు సరిగ్గా జీర్ణం కావు. ఇవి గ్యాస్ ట్రబుల్ ను కలగజేస్తాయి. దీంతో కడుపు ఉబ్బరం వస్తుంది. మీరు పాలు లేదా పాల ఉత్పత్తులను తీసుకున్నప్పుడు కడుపు ఉబ్బరం వస్తుంటే వాటి వల్లే ఆ సమస్య వస్తుందని గమనించాలి.

**ఫైబర్‌ను తీసుకోవడం..**

కొందరికి ఫైబర్ ఉండే ఆహారాలను తీసుకుంటే పడదు. అజీర్తి, గ్యాస్ ఏర్పడుతాయి. దీంతో కడుపు ఉబ్బరం వస్తుంది. ఫైబర్ ఉన్న ఆహారాలను తీసుకుంటే కడుపు ఉబ్బరం ఏర్పడితే ఆయా ఆహారాలను తీసుకోవడం తగ్గించాలి. లేదా పూర్తిగా మానేయాలి. దీంతో సమస్య నుంచి బయట పడవచ్చు. అలాగే శీతల పానీయాలు, సోడాలను తాగడం వల్ల కూడా కొందరికి పడవు. ఫలితంగా గ్యాస్ ట్రబుల్ సమస్య ఏర్పడుతుంది. ఇది పొట్ట ఉబ్బరాన్ని కలగజేస్తుంది. అదేవిధంగా సోడియం అధికంగా ఉండే ఆహారాలను తింటున్నా కూడా సరిగ్గా జీర్ణం అవకపోతే గ్యాస్ ఏర్పడి పొట్టలో ఉబ్బరం వస్తుంది. దీంతోపాటు ఇతర జీర్ణ సమస్యలు కూడా వస్తాయి.

**అతిగా భోజనం చేయడం..**

కొందరు అతిగా భోజనం చేస్తుంటారు. రాత్రిపూట సహజంగానే వారు ఎక్కువ ఆహారం తింటుంటారు. అయితే ఇలా చేయడం మంచిది కాదు. ఇది గ్యాస్, అజీర్తిని కలగజేస్తుంది. దీంతో కడుపు ఉబ్బరం కూడా వస్తుంది. రాత్రి పూట తేలిగ్గా జీర్ణం అయ్యే ఆహారాలను తినాలి. అలాగే వీలైనంత త్వరగా భోజనం చేయాలి. ఇలా పలు సూచనలు పాటిస్తూ ఆయా ఆహారాలను తీసుకోవడం మానేస్తే కడుపు ఉబ్బరం సమస్య నుంచి బయట పడవచ్చు. భోజనం చేసిన అనంతరం సోంపు గింజలను తింటుంటే కడుపు ఉబ్బరం నుంచి బయట పడవచ్చు. దీంతో గ్యాస్ సమస్య కూడా తగ్గుతుంది. జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది. జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.